మజర్‌హుస్సేన్‌కు ఇంటర్నేషనల్ పీస్ అవార్డు


అవార్డును అందుకుంటున్న మజర్ హుస్సేన్

హైదరాబాద్ సిటీ, మార్చి12 (ఆంధ్రజ్యోతి): కన్ఫెడరేషన్ ఆఫ్ వలంటరీ అసోసియేషన్(కొవ) స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మజర్ హుస్సేన్‌కు 'మజ కౌనె ఇంటర్నేషనల్ పీస్ అవార్డు -2024'ను స్విట్జర్లాండ్‌కు చెందిన 'సెంటర్ ఫర్ సోషియో కల్చరల్ ఇంటర్నేషన్ ఎ నాట్ ఫర్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్(సీఈఎస్‌సీఐ) మధురైలో మంగళవారం ప్రదానం చేసింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి మార్గరెట్ హ్యాజెన్‌టోబ్లర్ ప్రశంసాపత్రాన్ని అవార్డు గ్రహీతకు అందజేశారు. మూడు దశాబ్దాలుగా హింస, మతకలహాల వంటి సమస్యలకు వ్యతిరేకంగా మజర్ చేస్తోన్న సేవలకు గుర్తింపుగా ఆయన్ను ఈ అవార్డుతో సత్కరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సీఈఎస్‌సీఐ భారత అధ్యక్షుడు, మధ్యప్రదేశ్ మాజీ చీఫ్ సెక్రెటరీ ఎస్‌సీ బెహర్‌తో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

డాక్టర్ చిన్నారెడ్డి రైతు పక్షపాతి

● మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు


చిన్నారెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న మంత్రి తుమ్మల, సంఘం నాయకులు

రాజేంద్రనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ చిన్నారెడ్డిని మంగళవారం రాజేంద్రనగర్‌లోని జాతీయ వరి పరిశోధనా సంస్థ(ఐఐఆర్ఆర్)లో రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ నలభై సంవత్సరాలుగా రాజకీయ జీవితంలో ఉన్న చిన్నారెడ్డి రైతు పక్షపాతి అని అన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ఆయన ఎప్పుడూ రైతులకోసం మాట్లాడే వ్యక్తి అని గుర్తు చేశారు. గత శాసనసభ ఎన్నికలలో చిన్నారెడ్డి వనపర్తి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచి ఉంటే ఆయనే వ్యవసాయశాఖ మంత్రి అయ్యి ఉండేవారన్నారు. వ్యవసాయ రంగంపై అపూర్వ అనుభవం ఉన్న చిన్నారెడ్డి ఆలోచనలను తీసుకుని ముందుకు సాగుతానని తుమ్మల అన్నారు. ప్రభుత్వానికి పేరు వచ్చేలా వ్యవసాయశాఖ అధికారులు పనులు చేయాలని సూచించారు. అంతకుముందు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును డాక్టర్ చిన్నారెడ్డి భారీ గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ మీనాక్షీ రామన్ సుందరం, రాష్ట్ర వ్యవసాయశాఖాధికారుల సంఘం చైర్మన్ డాక్టర్ వైద్యనాథ్, అధ్యక్షుడు కృపాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విద్యాసాగర్, రిటైర్డ్ డీన్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

హైదరాబాద్ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 15, 16 తేదీల్లో నగరంలో పర్యటిస్తున్నందున ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్రపతి నిలయంలో పోలీస్, ఆర్‌అండ్‌బీ, ఫైర్, ఎనర్జీ, బీఎస్ఎన్ఎల్, ఐటీ, పీఆర్‌అండ్ ఆర్‌డీ, కంటోన్మెంట్ అధికారులతో నిర్వహించిన కోఆర్డినేషన్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో కంటోన్మెంట్ బోర్డు సీఈఓ, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ వెంకటి, ఏసీపీ వీవీఎస్ రామలింగరాజు, అగ్నిమాపక శాఖ అధికారి మధుసూదన్‌రావు, అటవీశాఖ అధికారి జ్యోతి, ఆర్డీఓ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

పంజాగుట్ట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం యూసుఫ్‌గూడలోని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి మాట్లాడుతూ 24 రోజుల సమ్మె హామీలు అమలు చేయాలని, ఒకపూట బడితోపాటు మే నెలంతా టీచర్లు, హెల్పర్లకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం నిర్వహించిన సమీక్షలో అంగన్‌వాడీల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పేద ప్రజల కోసం నిరంతరం సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను అవినీతిపరులని ఆరోపించడం అన్యాయమని, ఈ నిర్ణయాన్ని సీఎం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో మైత్రివనం సిగ్నల్ వరకు ర్యాలీ నిర్వహించి, బైఠాయించారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.కవిత, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సునీత, శోభ, సీఐటీయూ నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు.

అధిక అనస్తీషియాతో ల్యాబ్ టెక్నీషియన్ ఆత్మహత్య


రామునాయక్ (ఫైల్)

అల్వాల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ మృతిచెందాడు. అధికమొత్తంలో అనస్తీషియా (రోగికి ఇచ్చే మత్తుమందు) తీసుకోవడం వల్లే చనిపోయినట్టు తెలుస్తున్నది. ఈ సంఘటన మంగళవారం అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అల్వాల్ ఎస్‌హెచ్‌ఓ రాహుల్‌దేవ్ తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట్, బ్రాహ్మణపల్లికి చెందిన చత్రూనాయక్ కుమారుడు రామునాయక్ (27) గ్రేటర్ పరిధిలోని అల్వాల్‌లో ఉంటున్నాడు. స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గత పదేళ్లుగా అనస్తీషియా ఇచ్చే డాక్టర్ వద్ద సహాయకుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి తండ్రితో మాట్లాడిన రామునాయక్ ఆస్పత్రిలో విధులకు హాజరవుతున్నట్లు తెలిపాడు. అయితే, మంగళవారం ఉదయం ఆస్పత్రిలోని ఐసీయూలో బెడ్‌పై అనుమానాస్పదస్థితిలో మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. రామునాయక్ చేతికి అనస్తీషియా ఇంజక్షన్ తీసుకుంటున్న ఆధారం గల సీసీ ఫుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్కువ మొత్తంలో అనస్తీషియా తీసుకున్నందునే రామునాయక్ మరణించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

యాజమాన్యం ఒత్తిడి వల్లేనంటూ ఫిర్యాదు

ఆస్పత్రిలో పదేళ్లుగా పనిచేస్తున్న రామునాయక్‌కు యజమాన్యం నిత్యం నైట్ డ్యూటీలనే వేస్తూ మానసిక ఒత్తిడికి గురిచేసిందని అతని సోదరి పార్వతి ఆరోపించారు. ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలని గత మూడేళ్లుగా కోరుతున్నా ఆస్పత్రి యాజమాన్యం ఇవ్వకుండా అతన్ని వేధించిందని ఆమె మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. నెలరోజుల క్రితం ఆస్పత్రిలోనే అనస్తీషియా డోస్ తీసుకున్నప్పటికీ యాజమాన్యం తమకు సమాచారం ఇవ్వలేదన్నారు. రామునాయక్ మృతికి ఆస్పత్రి యాజమాన్య వైఖరే కారణమని ఆరోపిస్తూ కుటుంబసభ్యులతో కలిసి ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీ స్థలం కబ్జా చేసి నిర్మాణాలు



అక్రమంగా కొనసాగుతున్న నిర్మాణాలు

హైదర్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను అక్రమార్కులు వదలడం లేదు. ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జాలు చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. కాలనీ మురుగు ట్యాంక్ కోసం వదిలిన స్థలాన్ని ఆక్రమించి పదుల సంఖ్యలో నిర్మాణాలు చేసి పేదలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్లితే... ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ, దత్తాత్రేయ కాలనీలో పలు ప్రాంతాల్లో నివాసం ఉండే వారు కుటుంబనియంత్రణ (కు.ని.) శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ప్రోత్సాహకంగా 50 గజాల ఇంటి స్థలాలు అందజేశారు. అయితే కాలనీ నుంచి వెలువడే మురుగు రోడ్లపై పారకుండా ప్రత్యేకంగా 1000 గజాలకుపైగా స్థలాన్ని సెప్టిక్ ట్యాంక్‌కు, కాలనీ సంక్షేమానికి కేటాయించారు. ఈ క్రమంలో కాలనీలో భూగర్భ మురుగు కాలువలు నిర్మాణం చేయడంతో ఈ స్థలాలు ఖాళీగా ఉండటంతో కబ్జా చేస్తున్నారు. వరుస సెలవులు, అధికారులు ఇతర విధుల్లో బిజీగా ఉన్న సమయంలో రాత్రికిరాత్రే నిర్మాణాలు చేసి తెల్లారేసరికి అందులో నివాసముంటున్నారు. మనుషులుంటే ఇళ్లను కూల్చివేయరని అధికారులే నిర్మాణదారులకు ఊతమిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

తాత్కాలిక కూల్చివేతలు.. నోటీసులతోనే అధికారులు సరి

భూముల ధరలకు రెక్కలు రావడంతో ఆక్రమణదారుల ఖాళీ స్థలాల ఆక్రమణకు రంగం సిద్ధం చేశారు. తప్పుడు పట్టాలు సృష్టించి గదుల నిర్మాణం చేసి కోట్లు విలువ చేసే స్థలాన్ని లక్షల్లో పేదలకు విక్రయిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై స్థానికులు అధికారులకు ఫిర్యాదులు చేయడంతో గతవారం తాత్కాలికంగా కూల్చివేతలు చేపట్టారు. కానీ ఆక్రమణదారులు మూడు రోజుల్లో నిర్మాణాలు పూర్తి చేస్తూ ఇళ్లలో నివాసం ఉంటున్నారు. అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. అధికారులు, పాలకులు స్పందించి కాలనీ స్థలంలో నిర్మాణాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిలో కబ్జాలు


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కసిరెడ్డి భాస్కరరెడ్డి

గచ్చిబౌలి: మియాపూర్ సర్వేనెంబర్ 44లోని ప్రభుత్వ భూమిని కొంత మంది కబ్జాలకు పాల్పడుతున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి కలెక్టర్, ఆర్డీవో, శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 44లో ప్రభుత్వ భూమిని కబ్జాచేసి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సుమారు రెండెకరాలు కబ్జా చేసి నిర్మాణాలు చేపడు తున్నా వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.


బస్తీలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న అధికారులు

అక్రమ నిర్మాణం కూల్చివేత

గాజులరామారం: కట్టమైసమ్మ బస్తీలో కబ్జా అని మార్చి 10న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు స్పందించారు. కట్టమైసమ్మ బస్తీలో వెలసిన ఆర్ఐ రజనీకాంత్ సిబ్బందితో కలిసి సోమవారం అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు.

ఎర్రకుంట చెరువు జాయింట్ సర్వే

నిజాంపేట్: ప్రగతినగర్ ఎర్రకుంట చెరువును డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జాయింట్ సర్వే నిర్వహించారు. గతంలో బీజేపీ చేసిన పోరాటాలతో అధికారులు కదలివచ్చారు. నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ మాట్లాడుతూ.. ఎర్రకుంట చెరువులో అక్రమ నిర్మాణాలపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు చెరువులోని అక్రమ నిర్మాణాలను గుర్తించి 15వ తేదీన హద్దులు గుర్తించి అక్రమ నిర్మాణాలను కూడా మార్కింగ్ చేస్తామన్నారు.

నాలా పునరుద్ధరణ పనులు వేగంగా చేయాలి


మైసమ్మ చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

అల్లాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మూసాపేట్, అల్లాపూర్ డివిజన్‌లలోని పలు కాలనీల్లో మంగళవారం పర్యటించారు. రామారావునగర్, కబీర్‌నగర్, బబ్బుగూడ, రాజీవ్‌గాంధీనగర్‌లలోని నాలాలను పరిశీలించిన ఆయన, నాలాల పునరుద్ధరణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. వర్షాకాలంలోపు నాలా పునరుద్ధరణ పనులు పూర్తవ్వకపోతే ప్రజలు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అల్లాపూర్ కార్పొరేటర్ సబీహబేగం, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండి. గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్, అంబటి శ్రీనివాస్, ఐలయ్య పాల్గొన్నారు.

● ఎస్టీపీ పనుల పరిశీలన

కూకట్‌పల్లి: మురుగునీటి సమస్య పరిష్కారానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వందల కోట్లు నిధులు కేటాయించి, మురుగునీటి శుద్ధి ప్లాంట్స్ (ఎస్టీపీ)లను నిర్మించేలా చర్యలు తీసుకొన్నామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి డివిజన్ విజ్ఞానపురికాలనీ సమీపంలోని ఖాజాకుంటలో రూ.390 కోట్లతో నిర్మిస్తున్న ఎస్టీపీ పనులను పరిశీలించారు.

నకిలీ పోలీస్ అరెస్ట్

రూ.10 వేల నగదు, సెల్‌ఫోన్, బైక్ స్వాధీనం




సాయికిరణ్‌తేజ, నకిలీ ఐడీ కార్డు

రాయదుర్గం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): క్రైం, ఇంటెలిజెంట్స్ డిపార్టుమెంట్ నకిలీ ఐడీకార్డులు చూపిస్తూ బ్యూటీపార్లర్, ఇతర దుకాణాల యజమానులను బెదిరిస్తూ వేల రూపాయలు వసూలు చేసిన గుడిమల్కాపూర్‌కు చెందిన మణికొండ సాయికిరణ్‌తేజని మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. రాయదుర్గంలోని ఫార్చ్యూన్ అపార్టుమెంట్ 5వ అంతస్తులో స్టార్‌వెల్‌నెస్ అండ్ ఫ్యామిలీ సెలూన్ యజమానిని బెదిరించి రూ.10,000 వసూలు చేశాడు. గతంలో ఇతడిపై ఎస్ఓటీ పోలీసులకు పలు ఫిర్యాదులు అందడంతో సాయి కిరణ్‌తేజపై నిఘాపెట్టిన ఎస్ఓటీ పోలీసులు స్టార్‌వెల్‌నెస్ అండ్ ఫ్యామిలీ సెలూన్ యజమాని దగ్గర నుంచి రూ.10 వేలు తీసుకుని బయటకు వస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.10 వేల నగదు, సెల్‌ఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని విచారణ నిమిత్తం రాయదుర్గం పోలీసులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు.


పార్టీలో చేరిన వారితో జగదీశ్వర్‌గౌడ్

సంక్షేమ పథకాలతో ప్రజలకు సంతోషం : జగదీశ్వర్‌గౌడ్

గచ్చిబౌలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం కొండాపూర్ డివిజన్ వడ్డెరబస్తీకి నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాలరాజు, శ్రీను ఆధ్వర్యంలో జగదీశ్వర్ గౌడ్ సమక్షంలో బస్తీవాసులు పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలను చూసి పలువురు పార్టీలో చేరుతున్నారు. కార్యక్రమంలో నల్ల సంజీవరెడ్డి, వీరందర్‌గౌడ్, దినేష్, తిరుపతి, ప్రభాకర్, నర్సింహ, గోపాల్, స్వామి, సాయి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

టీపీసీసీ లేబర్‌సెల్ చైర్మన్‌గా సంజీవరెడ్డి

మియాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ టీపీసీసీ లేబర్‌సెల్ చైర్మన్ నల్ల సంజీవరెడ్డి, వైస్‌చైర్మన్ బి.కృష్ణముదిరాజ్, జాయింట్ సెక్రటరీ ఎం.తిరుపతి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వీరేందర్ గౌడ్, ఉపాధ్యక్షుడు దినేష్‌రాజ్‌ను నియమించారు. వీరిని నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర లేబర్ సెల్ చైర్మన్ ప్రకాశ్‌గౌడ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ వీరికి నియామక పత్రాలు అందజేశారు. అందరం కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే గాంధీ

వివేకానందనగర్‌కాలనీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్‌కాలనీ డివిజన్ ఇంద్రాహిల్స్‌కు చెందిన జోగిపేట రవీందర్‌కు సీఎంఆర్ఎఫ్ ద్వారా విడుదలైన రూ.90 వేల విలువైన చెక్కును ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బాధిత కుటుంబసభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్ గౌడ్, రవీందర్‌యాదవ్, భిక్షపతి, ఎండీ.ఇబ్రహీం, మామిడాల రాజు, రాజన్న కాశీనాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ఆస్‌బెస్టాస్‌కాలనీవాసులతో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

నూతన అసోసియేషన్‌కు అభినందన

కూకట్‌పల్లి డివిజన్ పరిధి ఆస్‌బెస్టాస్‌కాలనీకి సంబంధించిన నూతన అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని తన నివాసంలో కలిశారు. కాలనీ అభివృద్ధికి సభ్యులు పాటుపడాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ హుస్సేన్, సభ్యులు నర్సింలు, రఫిక్, పుష్ప పాల్గొన్నారు.

వాకింగ్ చేస్తున్న వృద్ధురాలి చైన్‌స్నాచింగ్

హైదర్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వాకింగ్‌కి వెళ్తున్న వృద్ధురాలు మెడలోంచి చైన్‌ను గుర్తు తెలియని వ్యక్తి లాక్కుని పరారైయ్యాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధుసూధన్ తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీలో ఉంటున్న మల్లవ్వ వృద్ధురాలు మంగళవారం కేపీహెచ్‌బీ రోడ్‌నెంబర్ 2లోని తన ఇంటి సమీపంలోని పార్కువైపు నడుచుకుంటూ వెళ్తుంది. ఈ క్రమంలో వెనుక నుంచి పరుగెత్తుకుంటూ వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని మూడుతులాల మంగళసూత్రం చైన్‌ను తెంపుకుని పరారయ్యాడు. దీంతో వృద్ధురాలు కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వివరాలు సేకరించారు. సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్నాథం చెరువులో గుర్రపుడెక్క తొలగింపు


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ గుర్నాథం చెరువులో దోమల సమస్య పరిష్కరించాలని స్థానికుల విజ్ఞప్తి మేరకు గురుపుడెక్కను తొలగిస్తున్నామని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం చెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులను ఎంటమాలజీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెరువు పరిసర ప్రాంతాల్లో కాలనీ వాసులు, అపార్టుమెంట్ వాసులు దోమల సమస్యను తమ దృష్టికి తీసుకురావడంతో చెరువులో గుర్రపుడెక్క తొలగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మహమ్మద్ జహంగీర్, మోహిన్, యదుల్ల, ఎంటమాలజీ అధికారి గణేష్ ఉన్నారు.

బీజేపీలో చేరిన శ్రీకృష్ణుడి భక్తురాలు


అనురాధను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న కసిరెడ్డి

మియాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చందానగర్‌కు చెందిన శ్రీకృష్ణ భక్తురాలు వి.అనురాధ మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఆయన పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. ఔర్ ఏక్ బార్ మోడీ సర్కార్ అనే లక్ష్యంతో తాను బీజేపీలో చేరడం జరిగిందని అనురాధ తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్‌రెడ్డి, గూడూరి త్రినాథ్, నంద నం వినయ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్‌పార్కును ప్రారంభించిన కార్పొరేటర్


చిల్డ్రన్స్ పార్కును ప్రారంభిస్తున్న నాగేందర్‌యాదవ్

చందానగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): శేరిలింపల్లి డివిజన్ ఆరంభ టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్కును కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు మానసిక ఉల్లాసానికి ఆటలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఆరంభ టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రరాథోడ్, మధుసూదన్‌రెడ్డి, భిక్షపతి, రెహనాబేగం, రాజేష్, సరిత, గోపాల్‌యాదవ్, రవియాదవ్, అరుణశ్రీ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో శిల్పకు స్వర్ణం


శిల్ప

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన డి.శిల్ప విజేతగా నిలిచింది. మంగళవారం చందానగర్‌లోని జీహెచ్ఎంసీ హాల్‌లో జరిగిన ఈ పోటీల్లో మహిళల మాస్టర్స్ విభాగం 84 కేజీల కేటగిరీలో శిల్ప స్వర్ణ పతకం సాధించింది. మొత్తంగా 205 కిలోల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది. హైదరాబాద్ లిఫ్టర్ ఎ.ఇందు మొత్తంగా 175 కిలోల బరువెత్తి ద్వితీయ స్థానం సాధించింది.

సీఏఏకు వ్యతిరేకంగా మనూలో నిరసన

హైదరాబాద్ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలును పునఃపరిశీలించాలని డిమాండ్ చేస్తూ గచ్చిబౌలిలోని మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మనూ)లో విద్యార్థులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్న ప్రజల సహకారంతో తమ గళాన్ని వినిపిస్తామన్నారు. సీఏఏ రాజ్యాంగ విరుద్ధమని దీనిపై పూర్తిస్థాయిలో చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. 2019లో అమల్లోకి వచ్చిన సీఏఏ దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు, ఆందోళనకు గురిచేసిందన్నారు. మతపరమైన సంబంధం లేకుండా ప్రతి పౌరుడి హక్కులను పరిరక్షించాలనేది తమ లక్ష్యమని విద్యార్థి నాయకులు అన్నారు.


కార్యక్రమంలో విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు

వస్తువుల నాణ్యత-భద్రతపై అవగాహన

రాయదుర్గం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో మంగళవారం బ్యూరో-జాతీయ ప్రమాణాల సంస్థ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యత- భద్రత- విశ్వసనీయత అనే అంశాలపై అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో వ్యాపారవేత్తలు కాబోయే వారికి తగిన సలహాలు, సూచనలు ఇస్తూ ప్రతి వస్తువును కొనేటప్పుడు వస్తువుల నాణ్యతను ఎలా గుర్తు పట్టాలి, బంగారం వస్తువులు కొనేటప్పుడు బీఐఎస్ హాల్‌మార్క్ వాటి గుర్తులు విలువలపై వివరించారు. నారాయణమ్మ ప్రొఫెసర్ డాక్టర్ రాకేష్, భరత్‌కుమార్, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అమిత్‌షా సభకు తరలిన బీజేపీ శ్రేణులు

గచ్చిబౌలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి చెందుతుందని శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఎల్‌బీస్టేడియంలో బీజేపీ విజయసంకల్ప యాత్రకు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. ఎల్లేశ్, రాధాకృష్ణయాదవ్, శ్రీను కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



దుండిగల్: అనారోగ్య కారణాలతో గుర్తు తెలియని వ్యక్తి గండిమైసమ్మ చౌరస్తాలో మృతి చెందాడు. దాదాపు 40 సంవత్సరాల వయస్సు ఉంటుందని, మంగళవారం ఉదయం స్థానికులకు మృతదేహం కనిపించడం తో దుండిగల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

జగ్జీవన్‌రాం విగ్రహం ప్రారంభం

జీడిమెట్ల: సూరారంకాలనీలో బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాన్ని సుభాష్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ జి.సురేష్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రాం సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జేమ్స్, దేవయ్య, శంకర్, శివాజీ, మంగ, మహాలక్ష్మీ, విజయ్, ప్రభాకర్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.


మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న నాలా

ప్రమాదకరంగా ఓపెన్ నాలా

గాజులరామారం: నిత్యం రద్దీగా ఉండే మూలమలుపు ప్రజలకు ప్రమాదకరంగా మారింది. గాజులరామారం ప్రధాన రహదారి నుంచి మెచ్ఏఎల్ కాలనీ మీదుగా జీడిమెట్ల బస్సుడిపోకు వెళ్లే రోడ్డులో సూపర్‌మాక్స్ కంపెనీ వెనుక ఉన్న మలుపులో నాలా ఓపెన్‌గా ఉండడంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాహనదారులు, పాదచారులు వాపోతున్నారు. మలుపులో ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని తక్షణమే మూత ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

'ఎస్‌బీఐ చైర్మన్‌ను అరెస్ట్ చేయాలి'

షాపూర్‌నగర్: సుప్రీంకోర్టు ఆదేశాలను దిక్కరిస్తూ ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను వెల్లడించకుండా బీజేపీకి, మోదీకి తొత్తుగా వ్యవహరిస్తున్న ఎస్‌బీఐ చైర్మన్‌ను అరెస్ట్ చేయాలని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మార్చి 6లోగా ఎన్నికల కమిషన్‌కు వివరాలు అందజేయాలని సుప్రీంకోర్టు తెలిపినా అమలు చేయడంలో ఎస్‌బీఐ విఫలం అయిందన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీ: పాదచారులు, క్రీడాకారుల దాహర్తి తీర్చేందుకు కార్మికులు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు కేపీహెచ్‌బీ మూడో ఫేజ్‌లోని రమ్య గ్రౌండ్ వద్ద భువన విజయం భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ మంగళవారం ప్రారంభించారు. రంజాన్ దీక్షలు ప్రారంభాన్ని పురస్కరించుకొని తొలిరోజు రస్నా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సాంబశివరావు, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ప్రకాష్, ప్రధానకార్యదర్శి వేగానందం, సంయుక్త కార్యదర్శి సలీం, కోశాధికారి ఏడుకొండలు పాల్గొన్నారు.

● సత్కారం



కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచిన ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకుడు కూన సత్యంగౌడ్ - హైదర్‌నగర్, ఆంధ్రజ్యోతి